క్లుప్తంగా

బెల్టుషాపులు అరికట్టాలని వినతి

బంట్వారం: మండల కేంద్రంలో కొనసాగుతున్న మద్యం బెల్టుషాపులను అరికట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు మహేష్ యాదవ్ బుధవారం అధికారులకు వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలో వైన్‌షాపు ఉన్నప్పటికీ వీధికో బెల్టుషాపులను నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి బెల్టుషాపులను అరికట్టాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ, తహశీల్దార్, పోలీస్ స్టేషన్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుభాష్, రాజు, జగదీశ్వర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ



ఉపాధి పనుల రికార్డులను పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందం

ధారూరు: ఉపాధి హామీ పనులు చేపట్టిన గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు బుధవారం తరలివెళ్లి ఆయా రికార్డులను పరిశీలించాయి.గ్రామస్థాయిలో నిర్వహించిన ఉపాధి పనుల వివరాలు, సంబంధిత రికార్డులను మండల కార్యాలయంలో తనిఖీ బృందాలు తీసుకున్నాయి. రాష్ట్ర రిసోర్స్ పర్సన్ గంగరాజు, ఏపీఓ వద్ద వివరాలు తీసుకొని మండల స్థాయి కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. పనులు చేసిన లబ్ధిదారుల వద్దకు వెళ్లి పూర్తి వివరాలను సేకరించాలని వారు సూచించారు.గ్రామాల్లో తనిఖీ అనంతరం మండల స్థాయి ప్రజావేదిక ఏర్పాటు చేస్తామని వారు వివరించారు.

నిధులు విడుదల చేయాలి

కుల్కచర్ల: నియోజకవర్గ వ్యాప్తంగా 'మన ఊరు మనబడి'లో భాగంగా పాఠశాలలో అభివృద్ధిపనులు నిర్వహించిన వారికి వెంటనే నిధులు విడుదల చేయాలని పరిగి నియోజకవర్గ పరిరక్షణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మన ఊరు మనబడి పనులు నిర్వహించిన నిర్వాహకులందరితో గురువారం పరిగి నియోజకవర్గ కేంద్రంలో నిరసన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి పెద్దఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి కృషి



గ్రామస్తులతో మాట్లాడుతున్న కర్ణాటక మాజీ మంత్రి లింబావళి అరవింద్

కర్ణాటక మాజీ మంత్రి అరవింద్ లింబావళి

తాండూరు రూరల్: రేణుక ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని కర్ణాటక రాష్ట్ర మాజీ మంత్రి అరవింద్ లింబావళి పేర్కొన్నారు. తాండూరు మండలం కోత్లాపూర్ గ్రామ సమీపంలోని రేణుక ఎల్లమ్మ అమ్మవారిని ఆయన దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ అధికారులు, గ్రామ పెద్దలతో ఆలయ అభివృద్ధి గురించి చర్చించారు. ఈ సందర్భంగా కర్ణాటక మాజీ మంత్రి అరవింద్ లింబావళి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శేఖర్‌గౌడ్, వెంకట్రాంరెడ్డి, సాయిలు, సందీప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, శ్యాం పటేల్, లాలయ్యగౌడ్, శంషోద్దీన్‌లు పాల్గొన్నారు.

ఖాళీల భర్తీకి కౌన్సెలింగ్

అనంతగిరి: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకోసం ఐదో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వికారాబాద్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ నరేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు ఈ నెల 28న ఉదయం 11గంటల వరకు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9177472488లో సంప్రదించాలన్నారు.

సబ్సిడీ సిలిండర్‌తో ఆర్థిక భారం తప్పింది



సబ్సిడీ పత్రాలను అందిస్తున్న కౌన్సిలర్ సల్మాఫాతిమా తదితరులు

తాండూరు: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన మహాలక్ష్మి పథకంతో పేదలకు ఆర్థిక భారం తప్పిందని తాండూరు మున్సిపల్ 21వ వార్డు కౌన్సిలర్ సల్మాఫాతిమా పేర్కొన్నారు. ఆమె 21వ వార్డులో మున్సిపల్ సిబ్బందితో కలిసి సబ్సిడీసిలిండర్లకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను మాజీ కౌన్సిలర్ జుబేర్‌లాలతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.



పరిగి: ఎంఈఓ గోపాల్‌ను సన్మానిస్తున్న టీయూటీఎఫ్ సభ్యులు



కుల్కచర్ల: రాంచందర్‌ను సన్మానిస్తున్న యువజన సంఘాల నాయకులు

ఎంఈఓల బాధ్యతల స్వీకరణ

జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాలకు ప్రభుత్వం ఎంఈఓలను నియమించింది. ఈ సందర్భంగా ప్రభుత్వం ఉత్తర్వులను అనుసరించి సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఎంఈఓలుగా నియమిస్తూ ఉన్నతాధికారులు బాధ్యతలు కేటాయించారు. అనంతరం బుధవారం చార్జ్ తీసుకున్న ఎంఈఓలను ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఆయా పాఠశాలలోని ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు వారిని సత్కరించారు.



దోమ: వెంకట్



దుద్యాల్: విజయ రామారావ్

దోమ: మండల విద్యాధికారిగా వెంకట్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బొంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో జీఏహెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న ఆయన మండల నోడల్ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నూతన ఎంఈఓలను నియమించడంతో దోమ మండలానికి నూతన ఆయన నియమితులయ్యారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

చౌడాపూర్ మండల ఎంఈఓగా రాంచందర్

కుల్కచర్ల: చౌడాపూర్ మండల నూతన ఇన్‌చార్జి ఎంఈఓగా రాంచందర్‌ను నియమించారు. ఆయా మండలాల్లో సీనియర్ ప్రధానోపాధ్యాయులకు ఇన్‌చార్జి ఎంఈఓలుగా బాధ్యతలను అప్పగించారు. చౌడాపూర్ మండల నోడల్ ఆఫీసర్‌గా ఉన్న రాంచందర్‌ను నూతన విద్యాధికారిగా నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల యువజన సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రాంచందర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొత్తఉమాపతిరెడ్డి, నరసింహ నాయక్, జరుప్ల వెంకట్, యాదయ్య, బి.వెంకటేష్, చిన్నయ్య, బొర్ర రమేష్, కృష్ణయ్య, మణికంఠ, అంజి, నర్సింహ, శ్రీను, గూడెం సాయిలు, గోపాల్, కల్పన, చెన్నమ్మ, అస్మద్‌బీ తదితరులు పాల్గొన్నారు.

మండల విద్యాధికారిగా గోపాల్

పరిగి: పరిగి మండల విద్యాధికారిగా గోపాల్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న హరిశ్చందర్ బదిలీపై నగరంలోని బాల్‌నగర్ మండలానికి వెళ్లారు. దీంతో విద్యాశాఖ ఉన్నత అధికారులు పట్టణ కేంద్రంలోని నంబర్ వన్ ఉన్నత పాఠశాలలో జీహెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న గోపాల్‌కు ఇన్‌చార్జ్ ఎంఈఓగా బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం పలు ఉపాధ్యాయ సంఘాల సభ్యులు ఆయనకు శాలువ కప్పి సన్మానించారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న విజయ రామారావ్‌ను ఎంఈఓగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఆయనను ఎస్టీయూ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. ప్రత్యేక ఉపాధ్యాయుడిగా నియమించబడి నారాయణపేట్, మహబుబ్‌నగర్ జిల్లాలో విధులు నిర్వహించి ఇటీవలే చేపట్టిన బదిలీల్లో భాగంగా ప్రమోషన్ ద్వారా దుద్యాల్ పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా విధుల్లో చేరాడు. ప్రస్తుతం ఎంఈఓగా అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించిందని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి షఫీ, మండల అధ్యక్షుడు అంజిలయ్య తదితరులు సన్మానించారు.

దాతల సహకారం అవసరం

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చంద్రయ్య

పూడూరు: పేద విద్యార్థులకు దాతల సహకారం అవసరమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చంద్రయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మేడిపల్లికలన్ గ్రామంలో గ్రీన్‌సోల్ ఫౌండేషన్ సహకారంతో అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు బ్యాగులు, మ్యాట్లు, పాదరక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సంస్థ ద్వారా ఎల్లప్పుడు చేయూత అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ప్రకాష్‌కుమార్, హెచ్ఎం శ్రీకాంత్, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్, రఘు, రవి, అజ్మత్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం



మోమిన్‌పేట: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

ఎంపీడీవో విజయలక్ష్మి

మోమిన్‌పేట: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మేకవనంపల్లి ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ యాదగిరి, ఎస్‌బీఎం కో ఆర్డినేటర్ లక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు గౌరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రిన్సిపల్ గీతాలక్ష్మి పట్నాయక్

అనంతగిరి: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని వికారాబాద్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీవీ గీతాలక్ష్మి పట్నాయక్ అన్నారు. బుధవారం వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని చదువుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థికి డిగ్రీ విలువైనదన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ గీతాలక్ష్మి పట్నాయక్

కొండచరియ విరిగిపడి దెబ్బతిన్న ఇల్లు

పూడూరు: మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాలు నీట మునిగాయి. వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. రహదారులు చెరువుల్లా తలపించాయి. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం వరకు వర్షం కురవడంతో పలు గ్రామాల్లో ఇండ్లు దెబ్బతిన్నాయి. చీలాపూర్‌లో వడ్డె తులసమ్మ ఇంటిపై కొండ చరియ విరిగిపడి పాక్షికంగా దెబ్బతింది. ఈ విషయంలో తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



చీలాపూర్‌లో కొండ చరియ విరిగిపడడంతో పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు

మరుగుదొడ్లు మంజూరు

పెద్దేముల్: మండలంలోని 26 అంగన్‌వాడీ కేంద్రాలకు మరుగుదొడ్లు మంజూరయ్యాయని పెద్దేముల్ ఎంపీడీఓ జర్నప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరుగు దొడ్డికి రూ.36వేలు నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. గ్రామంలో మహిళ సంఘం సభ్యులు, ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరూ మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టవచ్చని ఎంపీడీవో తెలిపారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

దోమ: కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ ఉపయోగపడుతుందని ఎస్ఐ ఆనంద్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ రాజీ కుదిర్చి సత్వర న్యాయం చేస్తారని తెలిపారు. ఈ నెల 28వ తేదీన పరిగి కోర్టులో నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్నచిన్న తగాదాలు, ఆర్థిక లావాదేవీలు, బీమా తదితర కేసులు ఉన్న కక్షిదారులు, బాధితుల ఆమోదంతో రాజీ కుదుర్చుకొని కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు.

నర్సింహారెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

కుల్కచర్ల: తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా చెల్లా నర్సింహారెడ్డి నియమితులైన సందర్భంగా బుధవారం ఆయన నివాసంలో కుల్కచర్ల మండల కాంగ్రెస్ నాయకుడు క్రిష్టారెడ్డి ఇతర నేతలతో మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్‌లో పార్టీ కోసం పనిచేసే వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. వివిధ కార్పొరేషన్లలో పదవులు పొందిన వారే దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

వ్యాసరచన పోటీలు

కుల్కచర్ల: రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జీవితచరిత్రపై బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని బాలికల జెడ్పీ పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రజక సంఘం ప్రధాన కార్యదర్శి మోత్కురు వెంకటేష్ మాట్లాడారు. బడుగు బలహీనవర్గాల ఉన్నతికి పెత్తందారులతో పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భీమయ్య, గోపి, రాజు, మ్యాజిక్‌బస్ కో ఆర్డినేటర్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయండి

మోమిన్‌పేట: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుడు నవాబు రాచిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలలో ఉద్యమకారులను పట్టించుకోలేదని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యమ కారులను ఆదుకొంటామన్నారనే విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి ఉద్యమకారుడికి 250గజాల ఇంటి స్థలంతో పాటు నిర్మించి ఇస్తామన్నారన్నారు. అదే విధంగా నెలకు రూ.25వేల పెన్షన్ ఇవ్వనున్నట్లు చెప్పారని ఆయన గుర్తు చేశారు. హెల్త్ కార్డులు, బస్సు ప్రయాణం, వంటివి అందజేయాలన్నారు.

విధి నిర్వహణలో బదిలీలు సహజం

బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు శేరిరాంరెడ్డి

దోమ: విధి నిర్వహణలో బదిలీలు సహజమని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు శేరిరాంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం దోమ మండల పరిధిలో దొంగ ఎన్కేపల్లి గ్రామంలోని పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు వీరప్ప, మల్లమ్మ, లక్ష్మణ్ నాయక్‌కు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి శాలువకప్పి, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం శేరిరాంరెడ్డి మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఈ పాఠశాలలో ఉపాధ్యాయులు ఎంతో సమర్థవంతంగా విధులు నిర్వహించారన్నారు. ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దిన ఘనత వారికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ హంసమ్మ, మాజీ చైర్మన్ యాదయ్య, గ్రామస్తులు చంద్రోఖరచారి, బాబా, తదితదిరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న శేరిరాంరెడ్డి

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఎంపీడీవో విశ్వప్రసాద్

తాండూరు రూరల్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని, రక్తహీనతను అధిగమించొచ్చని తాండూరు మండల ఎంపీడీవో విశ్వప్రసాద్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం పోషకమాస వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు తయారు చేసిన వంటకాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో కాంతారావు, అడిషన్ సీడీపీవో శ్రీలక్ష్మి, ఏపీఎం ఆనంద్, సూపవర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వప్రసాద్

సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

బ్లాక్ అధ్యక్షుడు నర్సిములు

పెద్దేముల్: సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తాండూరు కాంగ్రెస్ పార్టీ ఏ -బ్లాక్ అధ్యక్షుడు లోంక నర్సిములు పేర్కొన్నారు. బుధవారం పెద్దేముల్ మండల గోట్లపల్లి గ్రామంలో గ్యాస్ సబ్సిడీ పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10ఏళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పేదలకు ఒరిగిందేమి లేదన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే పేదలకు ఇండ్లు, రేషన్‌కార్డులు ఇవ్వనున్నట్లు, సీఎం రేవంత్‌రెడ్డి అందుకు సానుకూలంగా ఉన్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ ధారాసింగ్, తాండూరు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు నషీర్, ఉత్తమ్‌చంద్, మహేష్, చంద్రప్ప, మల్లప్ప స్వామి, రఫీక్, ప్రకాష్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేస్తాం

కుల్కచర్ల: ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల పరిధిలోని కుసుమసముద్రం, చెరువుముందలి తండాలో ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత సిలిండర్లకు సంబంధించిన సబ్సిడీ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మెరుగైన పాలన అందిస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి గోపాల్ నాయక్, బ్లాక్ అధ్యక్షుడు భరత్, ఏట వీరస్వామి, గ్రామ అధ్యక్షుడు కేశవులు, రాములు, బాబు, యాదయ్య, మాజీ ఎంపీటీసీ ఆనందం తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: సబ్సిడీ పత్రాలను అందజేస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

మాజీ ఎమ్మెల్యే ఆనంద్ వ్యాఖ్యలు బాధాకరం



బంట్వారం: సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశం

బంట్వారం: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశం మండిపడ్డారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓ కేసు విషయంలో మర్పల్లికి వెళ్లిన మెతుకు ఆనంద్ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రసాద్ కుమార్‌ను విమర్శించే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యేకు లేదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి గుర్తుకు రాలేదా అంటూ విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డి, నర్సింలు, యాదగిరి, శ్రీనివాస్, అంజిరెడ్డి, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: స్పీకర్‌పై మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్పల్లి, వికారాబాద్ కాంగ్రెస్ ముఖ్య నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ కార్యకర్తలను అనవసరంగా రెచ్చగొడుతున్నారన్నారు. ఎలాంటి సంబంధం లేని విషయంలో స్పీకర్‌పై, కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, అనంత్‌రెడ్డి, రామేశ్వర్, సురేష్, కిషన్‌నాయక్, రత్నారెడ్డి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: కాంగ్రెస్ నాయకులను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడం తగదని మాజీ ఎమ్మెల్యే డాక్టరు మెతుకు ఆనంద్‌కు మండల అధ్యక్షుడు శంకర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ విధులకు ఆటంకం కల్పించడమే కాకుండ అనవసరంగా కాంగ్రెస్ నాయకులను రెచ్చగొట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ డౌన్ డౌన్ అంటూ నినదించడం బాధాకరమన్నారు. మృతుని కేసు విషయమై విచారణ చేస్తున్న పోలీస్ విధులకు అటంకం కల్గించడం, బీఆర్ఎస్ నాయకులతో ధర్నాకు దిగడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి ఆనందం పేర్కొనడం బాధాకరం. ఈ విషయంలో ఎవరు ఎవరిపై కక్ష సాధిస్తున్నారో ప్రజలకు తెలుసన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సునితారెడ్డిపై ఎవరు దాడి చేయించారో, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించింది ఎవరో అందరికీ తెలుసన్నారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ జోలికి వస్తే ఊరుకోమని శంకర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, సురేందర్, సుభాష్‌గౌడు, మాణయ్య యాదవ్, మహంత్‌స్వామి, ఎజాస్ పటేల్, గిరిసింగ్, మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట: మాట్లాడుతున్న శంకర్

అభివృద్ధిలో భాగస్వామ్యం తప్పనిసరి

కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతీకిరణ్

పరిగి: దేశ అభివృద్ధిలో కార్యకర్తల భాగస్వామ్యం తప్పనిసరని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతీకిరణ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలు ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని కోరుతున్నారన్నారు. అందకే మూడో సారి బీజేపీకి అధికారాన్ని కట్టబెట్టారన్నారు. ప్రధాని సంకల్పించిన వికాసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రజల మద్దతు అవసరమన్నారు. దీనికోసం ఎక్కువ సంఖ్యలో ప్రజలు బీజేపీలో చేరి తమ మద్దతును ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సభ్యత్వం చేయిస్తున్న మారుతీకిరణ్